నమస్తే తెలంగాణ
# జగిత్యాల
5 కరీంనగర్, ఆదివారం 22 సెప్టెంబర్ 2024 JAGTIAL


### మీ కొడుకును అరెస్ట్ చేసినం
## డబ్బులు పంపండి



- ఎల్లారెడ్డిపేటలో ఓ వ్యక్తికి సైబర్ నేరస్తుల ఫేక్ కాల్
- సీబీఐ నుంచి చేస్తున్నామని హెచ్చరిక
- బేంబేలెత్తిన దినసరి కూలీ
- నిజం తెలుసుకొని ఠాణాలో ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 21: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రోజుకో రకం ఎత్తులతో సామాన్యులను బురిడీకొటిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాగే రెండ్రోజుల క్రితం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఓ దినసరికూలీకి ఫోన్ చేసి భయపెట్టగా, బాధితుడు శనివారం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిపేటకు చెందిన మంత్రి బాలనర్సు దినసరికూలీ. అతని కొడుకు ముస్తాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయంలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఓ అపరిచిత వ్యక్తి 92 3170646720 నుంచి బాలనర్సుకు వాట్సాప్ కాల్ చేశాడు. 'నేను సీబీఐ నుంచి మాట్లాడుతున్న. మీ కొడుకు ఓ అమ్మాయిని రేప్ చేస్తే అతన్ని పట్టుకొచ్చి విచారిస్తున్నం' అని భయపెట్టారు. అంతేగాక వీడియో కాల్ చేసి యూనిఫాంలో ఉన్న ఓ వ్యక్తి తాను పోలీసనని, మీ కొడుకుకు దెబ్బలు పడుతున్నాయని, ఇంకా కొడితే చనిపోతాడని బాల్‌నర్సుకు చెబుతూనే, వాడికి నీళ్లు పోయండంటూ హెచ్చరికగా మాట్లాడాడు. ఏ కేసు లేకుండా ఉండాలంటే వెంటనే ఫోన్‌పే, గూగుల్‌పేలో రూ.90వేలు పంపాలని చెప్పడంతో బాలనర్సు కంగుతిన్నాడు. కాల్ కట్ చేసి వెంటనే కాలేజీ ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసి, ఆరా తీయడంతోపాటు హాస్టల్‌కు వెళ్లాడు. తన కొడుకు క్షేమంగా ఉన్న సమాచారం తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నాడు. శనివారం జరిగిన ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

### ఇష్టారాజ్యంగా
## చెట్ల నరికివేత

కేసీఆర్ పాలనలో హరితహారంలో భాగంగా నాటిన కోట్లాది మొక్కలు ఏపుగా పెరుగగా.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు పాలనలో వాటిని ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నారు. రామడుగు మండలం చిప్పకుర్తి ఎస్సీ కాలనీ నుంచి మొదలు రాంచంద్రాపూర్, గుండి వరకు రహదారి పక్కన చెట్లను విద్యుత్‌శాఖ సిబ్బంది ఇష్టారాజ్యంగా నరికివేశారు. దీనిపై వాహనదారులు మండిపడుతున్నారు.

**- రామడుగు, సెప్టెంబర్ 21**



ప్రధాన రహదారి పక్కన నరికివేసిన చెట్లు

# సర్దుబాటుతో సరిపుచ్చితే ఎలా..?



కొత్త టీచర్లను ఇవ్వరు.. వలంటీర్లను నియమించరు?

పాఠశాల విద్య అస్తవ్యస్తంగా మారుతున్నది. బోధకుల కొరతతో కొట్టుమిట్టాడుతుండగా, సగం విద్యా సంవత్సరం పూర్తయిన తర్వాత రాష్ట్ర విద్యాశాఖ తేరుకున్నది. పిల్లలున్నచోట ఉపాధ్యాయులు లేకపోవడం, టీచర్లు ఉన్న స్కూళ్లో పిల్లలు లేకపోవడం, కనీసం వలంటీర్లను ఇవ్వకపోవడం వంటి కారణాలతో విద్యావ్యవస్థ గాడితప్పి విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో టీచర్ల అడ్జస్ట్‌మెంట్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. నిజానికి క్షేత్రస్థాయి నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకు ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే సర్దుబాటు ప్రక్రియ నిర్వహించినా.. 25 శాతం స్కూళ్లలో బోధన సిబ్బంది లోటు కనిపిస్తున్నది. అందులో 72 మంది టీచర్లు ప్రతిప్రతినిధులతో అండతో రిలీవ్‌కాకుండా దర్జాగా అక్కడే విధులు నిర్వర్తిస్తుండగా, అధికారులూ షోకాజ్ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం, ప్రక్రియ అంతా రాజకీయమయం కావడం విమర్శలకు తావిస్తున్నది. మళ్లీ రాష్ట్ర విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వుల్లోనూ స్పష్టత లేకపోవడం, వందలాదిగా విద్యావలంటీర్లు అవసరం ఉన్నా ప్రభుత్వం అందుకు అనుమతి ఇవ్వకపోవడంతో పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత వెంటాడుతున్నది. ఈ ప్రభావం అంతా రిజల్ట్‌పై పడే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతుండగా, ఖాళీలు భర్తీ చేయకుండా ఫలితాలకు తమను బాధ్యులను ఎలా చేస్తారన్న ప్రశ్న ఉపాధ్యాయుల్లో తలెత్తుతున్నది.

- ఇటీవలే ఉమ్మడి జిల్లాలో డీఈవోల ఉత్తర్వులతో కొంతమేర సర్దుబాటు
- అప్పటికీ 25 శాతం స్కూళ్లలో బోధన సిబ్బంది లోటు
- నాయకుల అండతో రిలీవ్‌కాని 72 మంది ఉపాధ్యాయులు
- సగం విద్యా సంవత్సరం పూర్తయిన తర్వాత తేరుకున్న విద్యాశాఖ
- సర్దుబాటుకు జీవో ఉత్తర్వులు.. అందులోనూ స్పష్టత కరువు
- ఇబ్బందుల్లో హెచ్‌ఎంలు
- వెంటనే సిబ్బందినైనా, వలంటీర్లనైనా ఇవ్వాలని విజ్ఞప్తులు
- పట్టని ప్రభుత్వం.. వలంటీర్లను ఇవ్వకుండా దాటవేత ధోరణి
- ఫలితాలపై ప్రభావం చూపే ముప్పు
- తమను బాధ్యుల్ని చేయొద్దంటున్న టీచర్లు

కరీంనగర్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాఠశాల విద్య బోధకుల కొరతతో అస్తవ్యస్తంగా మారుతున్నది. విద్యాసంవత్సరం ప్రారంభమైన కొద్ది రోజులకే టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులను రాష్ట్ర విద్యాశాఖ ఇవ్వాల్సి ఉండగా, సగం విద్యాసంవత్సరం పూర్తయిన తర్వాత ఈ నెల 20న జారీ చేసింది. నిజానికి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణలోకి తీసుకొని ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేయడంతో పాటు అధిక విద్యార్థులున్న పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని, లేదా విద్యా వలంటీర్లును నియమించాలని కోరుతూ అనేక వర్గాల నుంచి గతంలోనే ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందాయి. అయినా ప్రభుత్వం వాటిని లెక్క చేయలేదు. ఈ నేపథ్యంలో స్థానికంగా వచ్చిన ఒత్తిళ్ల మేరకు డీఈవోలు ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సర్దుబాటు చేసినా, ఇంకా మెజార్టీ పాఠశాల్లలో సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్నట్టు క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి ఉమ్మడి జిల్లాలో 2,465 పాఠశాలలున్నాయి. వీటిలో కేవలం 68 శాతం బడుల్లో మాత్రమే పూర్తి స్థాయి బోధకులున్నారని, ఇంకా 32 శాతం బడుల్లో ఖాళీలు ఉండడం వల్ల బోధన సరిగా జరగడం లేదని ఉపాధ్యాయ వర్గాల ద్వారా తెలుస్తున్నది. నిజానికి సర్దుబాటు చేసిన తర్వాత చూస్తే ఇంకా 25 శాతానికిపైగా బడుల్లో బోధకుల కొరత ఉందని సర్వేలు చెబుతున్నాయి. ఈ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని, విద్యావలంటీర్లను ఇవ్వాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతోపాటు ఉపాధ్యాయ సంఘాలు కొన్నాళ్లుగా మొర పెట్టుకుంటున్నాయి. ఈ విషయంపై ఏమాత్రం స్పందించని ప్రభుత్వం, కేవలం మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలకు మాత్రమే విద్యా వలంటీర్లను నియమించుకోవడానికి అవకాశం ఇచ్చింది. నిజానికి క్షేత్రస్థాయి పరిస్థితులు చూసినా, లేదా ఉపాధ్యాయ వర్గాలు, ఆయా జిల్లాల మండల, విద్యాశాఖ కార్యాలయాల ద్వారా వస్తున్న సమాచారం ప్రకారం చూస్తే ఉమ్మడి జిల్లాలో సుమారు 600కుపైగా విద్యా వలంటీర్ల పోస్టులు తక్షణం అవసరం ఉన్నాయి. వీటిని భర్తీ చేస్తే సర్కారు బడుల్లో చదువులు సజావుగా సాగేవి. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దీంతో మెజార్టీ పాఠశాలల్లో సబ్జెక్టు బోధించే వారు లేక చదువులు చతికిల పడుతున్నాయన్న ఆవేదన ఉపాధ్యాయుల్లో వ్యక్తమవుతున్నది.

### రిలీవ్‌కాని వారిపై చర్యలేవి?

క్షేత్రస్థాయి నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకొని ఆయా జిల్లాల్లో జిల్లా విద్యాధికారులు కలెక్టర్ల అనుమతితో టీచర్లను సర్దుబాటు చేస్తూ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని ఆ ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ మేరకు పలువురు ఉపాధ్యాయులు వాళ్లకు కేటాయించిన పాఠశాలల్లో చేరి విధులు నిర్వర్తిస్తుండగా, ఉమ్మడి జిల్లాలో 72 మంది టీచర్లు జిల్లా విద్యాధికారులు ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేసినట్లుగా తెలిసింది. ఉత్తర్వులు అందగానే అధికారపార్టీ నాయకుల వద్దకు వెళ్లి, వాళ్ల ఉత్తర్వులు నిలుపుచేసేలా డీఈవోలతో పాటు మండల విద్యాధికారులపై ఒత్తిళ్లు చేయించారు. దీంతో సర్దుబాటు పూర్తిస్థాయిలో చేయలేని పరిస్థితి ఏర్పడింది. అయితే కొన్ని చోట్ల నిబంధనలు ఉల్లంఘించిన ఉపాధ్యాయులకు మాత్రం అధికారులు షోకాజ్ నోటీసులు అందించి, ఎలాంటి చర్యలు తీసుకోకుండా చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. రాజకీయ నాయకుల అండదండలు చూసుకొని, తమకు ఏమీ కాదులే అన్న భరోసా వారిలో వ్యక్తమవుతున్నది. ఈ పరిస్థితులో ఉన్నాధికారులు కూడా వెనుకా ముందు ఆలోచిస్తున్నారు. రాజకీయ నాయకులను కాదంటే, తమ ఉద్యోగాలకు ఎక్కడ ఇబ్బందవుతుందోనన్న నిబంధనలు బేఖాతరు చేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు జంకుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర విద్యాశాఖే ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఆ అవకాశాన్ని పరిగణలోకి తీసుకొని, గతంలో ఇచ్చిన ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేసే అవకాశం ఆయా జిల్లా విద్యాశాఖాధికారులకు ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఉత్తర్వులు ధిక్కరిస్తూ యథాస్థానంలో కొనసాగుతున్న ఉపాధ్యాయులను ముందుగా రిలీవ్ అయ్యేలా విద్యాధికారులు చర్యలు తీసుకోవాలి. అలా జరిగితేనే విద్యార్థులకు కొంత మేరకైనా బోధన అందే అవకాశం ఉన్నది. ఇదే సమయంలో టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యావలంటీర్లను నియమించుకునేందుకు ప్రభుత్వానికి వివరాలు సమర్పించాల్సిన అవసరం ఉందని, అలా జరిగితే కనీసం ఇప్పటి నుంచైనా చదువులు సజావుగాసాగేందుకు అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

### బోధకులను ఇవ్వకుండా బాధ్యులు అంటే ఎలా..?

'మా పాఠశాలల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సర్దుబాటైనా చేయండి. లేదా విద్యావలంటీర్లనైనా ఇవ్వండి' అంటూ వందలాది స్కూళ్ల హెచ్‌ఎంలు ఆయా జిల్లాల విద్యాశాఖకు మొర పెట్టుకుంటున్నారు. పాఠశాలల ఆరంభం నుంచి నేటి వరకు ఆయా జిల్లా విద్యాశాఖాధికారులకు ఈ తరహా వినతులు వస్తూనే ఉన్నాయి. బోధకులు లేకపోవడం విద్యావ్యవస్థపై ప్రభావం పడుతున్నదని, తద్వారా పిల్లల తల్లిదండ్రుల నుంచి మాట పడాల్సి వస్తున్నదని, అలాగే పదోతరగతి ఉన్న చోట ఉత్తీర్ణత శాతంపై ప్రభావం కచ్చితంగా పడుతుందన్న ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆయా పాఠశాలల నుంచి వస్తున్న విజ్ఞాపనలపై జిల్లా విద్యాధికారులు చాలా విషయాల్లో స్పష్టత ఇవ్వడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఖాళీలను పూర్తి చేయకుండా, నియామకాలు చేపట్టకుండా, బోధన సిబ్బందిని ఇవ్వకుండా.. ఉత్తీర్ణత శాతం పెంచమంటున్నారని, లక్ష్యం మేరకు ఉత్తీర్ణత శాతం సాధించకపోయినా, లేదా విద్యార్థులకు విద్యా ప్రమాణాలు లోపించినా, నాణ్యమైన విద్య అందకపోయినా తమపై చర్యలు తీసుకుంటామంటూ ఉన్నతాధికారులు పలుసార్లు హెచ్చరికలు చేస్తున్న తీరు తమను ఆందోళనకు గురిచేస్తున్నదని మెజార్టీ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. సబ్జెక్టు బోధించే వారిని ఇవ్వకుండా తమను బాధ్యులను చేయడం ఎంత వరకు సమంజసం అన్న ప్రశ్నలను ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు లేవనెత్తుతున్నాయి. ఒకటి రెండు రోజులుంటే, నడిపేందుకు ఇబ్బంది ఉండదని, కానీ ఏడాది పొడవునా సబ్జెక్టు బోధించే వారు లేకుండా ఎలా రిజల్ట్ సాధిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని ఉపాధ్యాయులు చెబుతున్నా, పై స్థాయి అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తాజాగా సర్దుబాటు నిమిత్తం ఇచ్చిన ఆదేశాలను పరిగణలోకి తీసుకొని జిల్లా విద్యాధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఉత్తర్వులు అందుకొని అదే స్థానంలో కొనసాగుతున్న ఉపాధ్యాయులు రిలీవ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వస్తున్నది. దీనిపై ఆయా జిల్లాల విద్యాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతుండగా, విద్యా వలంటీర్లను ఇచ్చే విషయంలోనూ ప్రభుత్వం ఆలోచించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.



గంభీరావుపేటలో ఈ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న నాబార్డు రిసోర్సు పర్సన్, కొండూరి

## గ్రామీణ ప్రాంతాలకు డిజిటల్ వైద్య సేవలు

- ఎం స్వాస్థ్, నాబార్డు ఆధ్వర్యంలో గంభీరావుపేటలో ఈ-క్లినిక్ ప్రారంభం
- రాష్ట్రంలో ప్రథమంగా ఏర్పాటు

గంభీరావుపేట, సెప్టెంబర్ 21: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలతో పాటు విలువైన సలహాలు అందించడమే లక్ష్యంగా ఎం స్వార్థ్, నాబార్డ్ ఆధ్వర్యంలో ఈ-క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నది. అందులో భాగంగా గంభీరావుపేట ప్రాథమిక వ్యవసా య సహకార సంఘ ఆవరణలో రాష్ట్రంలోనే ప్రథమంగా ఏర్పాటు చేయగా, శనివారం నాబార్డు రీసోర్సు పర్సన్ షరీఫ్ నాఫ్స్ కాబ్ మాజీ చైర్మన్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఎం స్వాస్థ్ సౌత్ ఇండియా మార్కెటింగ్ రీజినల్ హెడ్ శరత్‌చంద్రతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ- క్లినిక్ ద్వారా అందిస్తున్న డిజిటల్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక్కో కుటుంబం ₹365 చెల్లిస్తే ఏడాదిపాటు తమ అరోగ్య సమస్యలపై ఎమ్ స్వాస్థ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అం దిస్తున్నట్లు తెలిపారు. దేశంలో 3500 ఈ-క్లినిక్ కేం ద్రాలను ఏర్పాటు చేశామని శరత్‌చంద్ర తెలిపారు. ప్రీమియం చెల్లించిన సం ఘం పరిధిలోని వారికి ఏడాది పాటు ఈ క్లినిక్ ద్వా రా 400 మంది వైద్యులు ఆన్‌లైన్‌లో ఆడియో, వీడియో ఆధారంగా సలహాలు, సూచనలు అందిస్తారని, 24 గంటల సౌకర్యం ఉంటుందని తెలిపారు. 38 రకాల మందులను ఉచితంగా అందిస్తామన్నా రు. రాష్ట్రంలో ప్రాథమిక సహకార సంఘాలు, నాబార్డు సౌజన్యంతో ఉమ్మడి కరీంనగర్, వరంగల్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద16 ఈ-క్లినిక్ కేంద్రాల్లో ఏర్పాటుకు ఎంచుకున్నామని తెలిపారు. అందులో మొట్ట మొ దటగా గంభీరావుపేటలో ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఈవో రాజిరెడ్డి, డైరెక్టర్లు, రైతులు, నేతలు పాల్గొన్నారు.

## కరీం'నగరం'లోకి కొత్తపల్లి!




- ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్‌కు మంత్రి పొన్నం లేఖ
- మరిన్ని గ్రామాల విలీనానికి సైతం..
- మరోసారి తెరపైకి విలీన అంశం

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధి మరింత విస్తరించనుందా..? కొత్తపల్లి మున్సిపాలిటీ నగరంలో కలువనున్నదా..? దీంతో పాటు మరిన్ని గ్రామాలు విలీనం కానున్నాయా..? అంటే.. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిపాదనలు పంపించాలని తాజాగా, కలెక్టర్‌కు లేఖ రాయడం అందుకు బలాన్ని చేకూరుస్తున్నది. దీంతో గ్రామాల విలీనం ఖరారయ్యే అవకాశం కనిపిస్తున్నది. ఈ క్రమంలో నగరపాలక సంస్థలో గ్రామాల విలీనం మరోసారి తెరపైకి వచ్చింది.

కరీంనగర్ కార్పొరేషన్, సెప్టెంబర్ 21 : ఐదేళ్ల క్రితం కరీంనగర్ నగరపాలక సంస్థలో చుట్టూ ఉన్న తొమ్మిది గ్రామాలను విలీనం చేశారు. కాగా, ప్రస్తుతం మరో ఆరు గ్రామాలతోపాటు, కొత్తపల్లి మున్సిపాలిటీని విలీనం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. పెరుగుతున్న నగర జనాభాతో చుట్టూ ఉన్న గ్రామాల్లోనూ నివాసాలు పెరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఇతర సౌకర్యాలను పెంచేందుకు ఆయా గ్రామాలను నగరపాలక సంస్థలో విలీనం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో శివారు గ్రామాలను విలీనం చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ నెల 9న జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. శివారు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సదుపాయాలను మెరుగుపర్చడంతోపాటు, పట్టణీకరణను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

**మంత్రి లేఖ ప్రకారం కొత్తగా విలీనమయ్యేవి..**

- కొత్తపల్లి మున్సిపాలిటీ
- కొత్తపల్లి మండలంలోని చింతకుంట, లక్ష్మీపూర్, మల్కాపూర్
- కరీంనగర్‌రూరల్ మండలంలోని బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్

### మరోసారి విలీనం.. చర్చ

విలీనం కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాయడం కరీంనగర్ చుట్టూ ఉన్న గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో నగరపాలక సంస్థలో తొమ్మిది గ్రామాలను విలీనం చేసిన సమయంలోనే బొమ్మకల్ గ్రామ పంచాయతీని విలీనం చేయకపోవడంపై విమర్శలు వచ్చాయి. అలాగే, కొత్తపల్లి మున్సిపాలిటీని ఏర్పాటు చేయగా, ఇప్పుడు దానిని కూడా కరీంనగర్‌లో విలీనం చేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నారు. దీంతో ఇప్పుడు ఆయా ప్రాంతాల్లో ప్రజల్లో జోరుగా చర్చలు సాగుతున్నాయి. ఇప్పటికే విలీనం చేసిన గ్రామాల్లో పరిస్థితులను బేరీజు వేసుకుంటున్న ఆయా గ్రామాల ప్రజలు ఈ విలీనానికి ఏ మేరకు స్పందిస్తారన్న విషయంలో ఆసక్తి నెలకొంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాలను విలీనం చేసిన సమయంలో మూడేళ్లపాటు ఆయా గ్రామాల్లో ఆస్తి పన్నులను పెంచకుండా చర్యలు తీసుకున్నది. ఆ మేరకు ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పెద్ద ఎత్తున నిధులు కూడా కేటాయించింది. కాగా, ప్రస్తుత ప్రభుత్వం ఈసారి విలీనం చేసే ఆయా గ్రామాల ప్రజలకు ఎలాంటి హామీలు ఇస్తుందన్న చర్చ జరుగుతున్నది. మొత్తానికి మరోసారి నగరపాలక సంస్థలో గ్రామాల విలీనం ఇప్పుడు హాట్‌టాఫిక్‌గా మారింది.

## ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

- విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఫలితం
- ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబర్ 21: కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి హైస్కూల్‌లో 6వ తరగతి విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఇద్దరు ఉపాధ్యాయులపై వేటు పడింది. ఈ మేరకు ఉపాధ్యాయులు పీ సదానందం (ఎస్‌ఏ ఇంగ్లిష్), అబ్దుల్ ఖాద్రి (ఎస్‌ఏ బయోసైన్స్)ను కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం సస్పెండ్ చేస్తూ ఇన్‌చార్జి డీఈవో జనార్దన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. అసలేం జరిగిందంటే.. ఆ ఇద్దరు ఉపాధ్యాయులు తమతో కొంతకాలంగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థినులు ఈ నెల10న హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. ఇంట్లోనూ చెప్పడంతో తల్లిదండ్రులు ఆగ్రహించి, ఈ నెల 12న పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడు సదానందంకు దేహశుద్ధి చేశారు. మరో ఉపాధ్యాయుడు ఖాద్రి ముందే ఊహించి విధులకు లీవ్ పెట్టాడు. దీనిపై డీఈవో స్పందించి, ఈ నెల 13న తారుపల్లి పాఠశాలలో విచారణ జరిపి, నివేదికను కలెక్టర్‌కు పంపించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇద్దరు టీచర్లను సస్పెండ్ చేసినట్టు పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాగా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కాల్వశ్రీరాంపూర్ పోలీసులు ఆ ఇద్దరు ఉపాధ్యాయులపై పోక్సో కేసు నమోదు చేశారు.

## ఊట్‌పల్లి బడిలో పాముల బెడద

- ఇటీవల భారీ కొండ చిలువ రాక
- విద్యార్థుల్లో భయంభయం
- తల్లిదండ్రుల ఆందోళన
- కలెక్టర్‌కు వినతి



మూడు రోజుల క్రితం పాఠశాల ఆవరణలోకి వచ్చిన కొండ చిలువ

కథలాపూర్, సెప్టెంబర్ 21: కథలాపూర్ మండలం ఊట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పిల్లలు పాముల బెడదతో వణికిపోతున్నారు. స్కూల్ చుట్టూ అపరిశుభ్ర వాతావరణం, చెట్ల పొదలు, ఆవరణలోనే పల్లె ప్రకృతి వనం ఉండడంతో నిత్యం స్కూల్లోకి విష పురుగులు, పాములు వస్తుండగా, హడలెత్తిపోతున్నారు. ఇటీవల పాఠశాల వరండాలో నాగుపాము, ఆవరణలోకి కొండ చిలువ వచ్చాయని, ఇలాగైతే తాము ఎలా చదువుకునేదంటూ..? పిల్లలు ప్రశ్నిస్తుండగా తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఇటీవల కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతి పత్రం కూడా అందించినట్లు గ్రామస్తులు తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

## సైనికుల్లా పనిచేయాలి

- స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి
- మెజార్టీ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకుందాం
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పిలుపు
- హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం

హుస్నాబాద్/ చిగురుమామిడి, సెప్టెంబర్ 21: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని, విజయమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. మెజార్టీ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకొని సత్తాచాటుదామని, బీఆర్‌ఎస్ కార్యకర్తల బలమేమిటో నిరూపించుకుందామన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామ శివారులోని శుభం గార్డెన్స్‌లో బీఆర్‌ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇక నుంచి గ్రామ స్థాయి సమావేశాలు నిర్వహించి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. పార్టీని నమ్ముకొని ఇన్నేండ్లు ఉన్న కార్యకర్తలకు ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. రిజర్వేషన్ ఏది వచ్చినా ఎక్కువ సర్పంచ్, ఎంపీటీసీలను గెలిపించుకోవడమే లక్ష్యంగా ముందుకు పోదామని కార్యకర్తలకు ఉద్బోధించారు. త్వరలో జరుగబోయే పట్టభద్రుల ఎన్నికలను కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా నడుచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని, ఐక్యంగా ఉండి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గ్రామస్థాయిలో ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. స్థానికంగా గెలిచిన ఎమ్మెల్యే మంత్రి అయినప్పటికీ నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా కావడం లేదని విమర్శించారు. మంత్రికి మాటలు తప్ప చేతలు చేతకావన్నారు. ఆయనకు హైదరాబాద్, కరీంనగర్‌పై ఉన్న ప్రేమ హుస్నాబాద్‌పై లేదన్నారు. నెలరోజుల్లో గౌరవెల్లి ద్వారా నీళ్లందిస్తామని పది నెలలు గడిచినా ఏం జరిగిందో ప్రజలకు వివరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మన సత్తా ఏమిటో నిరూపించి బీఆర్‌ఎస్ పార్టీతో పాటు కార్యకర్తల ఐక్యత ఏమిటో చాటుదామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అంతకుముందు బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, హన్మకొండ జడ్పీ మాజీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, సిద్దిపేట జడ్పీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహ రి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశం లో మాజీ ఎంపీపీ కొత్తవినీతాశ్రీనివాస్ రెడ్డి, బీఆర్‌ఎస్ చిగురుమామిడి మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, జిల్లా నాయకులు సాంబారి కొమురయ్య, మండల నాయకులు పెనుకుల తిరుపతి, బెజ్జంకి రాంబాబు, పెసరి రాజేశం, మంకు శ్రీనివాస్ రెడ్డి, అనుమాండ్ల సత్యనారాయణ, కృష్ణమాచారి, మాజీ సర్పంచ్లు సన్నీల్ల వెంకటేశం, బోయిని శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు ఎస్కే సిరాజ్, బోయిన్ రమేశ్, కొమ్ము కొమురయ్య, బుర్ర తిరుపతి, కల్వల సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు